సాక్షి వరంగల్

ఆదివారం । 31 । మార్చి । 2024



కేయూ బడ్జెట్ 431.20 కోట్లు

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేయూ ప్రతిపాదించిన రూ.431.20 కోట్ల బడ్జెట్‌కు అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది.

- 8లో▸



సరిహద్దు పోలీసుల సమావేశం

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు పోలీసులు రహస్య సమావేశం నిర్వహించారు.

- 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39°/24°

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి పెరుగుతుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.



న్యూస్‌రీల్

చిన్నారులను కొట్టిన ఉపాధ్యాయురాలు



దెబ్బలను చూపిస్తున్న విద్యార్థిని సీతు

ఖానాపురం : చదవడంలేదని ఇద్దరు చిన్నారులను ఉపాధ్యాయురాలు కొట్టిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భద్రుతండాకు చెందిన చిన్నారులు కావ్యశ్రీ, సీతు ఓ ప్రైవేట్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నారు. రోజూ మాదిరిగానే పాఠశాలకు వెళ్లగా చదవడం లేదని ఇద్దరిని చితకబాదింది. ఇంటికి వెళ్లిన తర్వాత వారు కుటుంబ సభ్యులకు విషయాన్ని చెప్పారు. వెంటనే విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించడంతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

చివరి రోజు 15 మంది గైర్హాజరు

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలో ఈనెల 18న ప్రారంభమైన టెన్త్ వార్షిక పరీక్షలు శనివారం ముగిశాయి. చివరి రోజు సాంఘికశాస్త్రం పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. 9,456 మందికి 9,441 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించారు. వచ్చే నెల 2 నుంచి పేపర్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని, ఇందుకోసం 300 మంది సీనియర్ స్కూల్ అసిస్టెంట్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఏ రోజు జవాబు పత్రాలను ఆ రోజే భారీ బందోబస్తు మధ్య పోస్టల్ శాఖ ద్వారా పంపించినట్లు డీఈఓ వెల్లడించారు.

చికిత్స పొందుతున్న బాలుడి మృతి

ఖానాపురం: చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందిన సంఘటన బుధరావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్‌కే.ఉబేదుల్లా (10) శుక్రవారం రాత్రి 8 గంటలకు మసీదులో జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరుకావడానికి గ్రామంలోని జాతీయ రహదారి దాటుతున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా తీవ్ర గాయాలైన బాలుడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించిన విషయం విదితమే. కాగా, చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి ఉబేదుల్లా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై రఘుపతి బుధరావుపేటలో సీసీ కెమెరాలను పరిశీలించి వాహనాన్ని గుర్తించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కాసోజు వెంకటాచారిపై కేసు నమోదు చేశారు. బాలుడి మేనమామ అబిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ: వరంగల్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ ఆధ్వర్యంలో ఆపదమిత్ర స్కీం వలంటీర్ల (స్త్రీ, పురుషులు) శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి జిల్లా నివాసితులై ఉండాలని పేర్కొన్నారు. 7 లేదా 10వ తరగతి మెమోతోపాటు మెడికల్ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో ఏప్రిల్ 6వ తేదీలోగా మట్టెవాడలోని అగ్నిమాపక కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని ఆమె అన్నారు. ఎక్స్ ఆర్మీ, రిటైర్డ్ మెడికల్, సివిల్ ఇంజనీర్ల వయస్సులో సడలింపు ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు నోడల్ ఆఫీసర్ 8712699149 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికుల సమస్యలు, సలహాలు, సూచనలు తెలుసుకోవడానికి ఆదివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని ఆయన కోరారు.

విద్యుత్ వినియోగం పైపైకి..

భానుడి ప్రతాపంతో పెరిగిన కరెంట్ వాడకం

- 2023 మార్చిలో 115 మిలియన్ యూనిట్లు.. ఇప్పుడు 135 మిలియన్ యూనిట్లు
- ఉక్కపోతతో జోరుగా కూలర్లు, ఏసీల కొనుగోళ్లు
- ఏప్రిల్, మేలో విద్యుత్ వినియోగం ఇంకా ఎక్కువ



సాక్షి, వరంగల్: భానుడి ప్రతాపంతో జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఫలితంగా మీటర్ రీడింగ్‌లు రయ్‌రయ్‌మంటున్నాయి. ఓవైపు ఎండలు దంచికొడుతుండడంతో ఉక్కపోత తట్టుకోవడానికి ఇళ్లలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం భారీగా పెరగడం.. ఇంకోవైపు బోరుబావుల కింద యాసంగి పంటల సాగు కోసం విద్యుత్ మోటార్లు గంటలకొద్దీ నడుస్తున్నాయి. గతేడాదితో పోల్చుకుంటే ఈసారి విద్యుత్ వినియోగం పెరిగింది. 2023 మార్చిలో 115 మిలియన్ యూనిట్లు రికార్డయితే.. ఈసారి 135 మిలియన్ యూనిట్లు శనివారం నాటికి నమోదయ్యాయి. అంటే గతేడాదితో పోల్చుకుంటే దాదాపు 20 మిలియన్ యూనిట్లు అదనంగా ప్రజలు వాడుకున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో విద్యుత్ వినియోగం ఇంకా భారీగా పెరుగొచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలను 35 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతుండడం గమనార్హం. ఇంకా రానున్న రోజుల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ విభాగాధికారులు అంటున్నారు. దీని ఆధారంగా విద్యుత్ వినియోగం మరింత పెరుగనుంది.

ట్రాన్స్‌ఫార్మర్లపై ఓవర్‌లోడ్.

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో విద్యుత్ వినియోగం పెరిగింది. 2023 జనవరిలో 97 మిలియన్ యూనిట్ల వాడకం ఉంటే.. 2024 జనవరిలో అది 103 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. 2023 ఫిబ్రవరిలో 109 మిలియన్ యూనిట్లను వినియోగదారులు వాడితే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో అది 115 మిలియన్ యూనిట్లకు చేరుకుంది.

2023 మార్చిలో 115 మిలియన్ యూనిట్లుగా రికార్డు అయితే ఈ ఏడాది మార్చిలో ఏకంగా 135 మిలియన్ యూనిట్లకు ఎగబాకింది. అంటే గతేడాదితో పోల్చుకుంటే ఈసారి విద్యుత్ వినియోగం పెరగడం గమనించవచ్చు. దీనివల్ల ఇప్పటికే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మీద పడుతున్న ఓవర్‌లోడ్‌తో వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నారే తప్ప అక్కడ అదనంగా అధిక సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంలేదు. ఇలా ఒక చోట ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చేసిన మరమ్మతులు మళ్లీ రెండుమూడు రోజులకే పునరావృతం అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. 'ఈ వేసవిలో విద్యుత్ వినియోగం అంచనాకు మించి నమోదవుతోంది. ఏప్రిల్, మే నెలలో ఇంకా గరిష్ఠంగా 150 మిలియన్ యూనిట్ల నుంచి 170 మిలియన్ యూనిట్లకు వరకు ఉండొచ్చని ఇప్పటి వాడకాన్ని బట్టి తెలుస్తోంది. డిమాండ్ ఎంత పెరిగినా తట్టుకునేందుకు అదనపు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నాం' అని విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

విద్యుత్ వినియోగం ఇలా..

సంవత్సరం	నెల	మిలియన్ యూనిట్లు
2023	జనవరి	97
2024	జనవరి	103
2023	ఫిబ్రవరి	109
2024	ఫిబ్రవరి	115
2023	మార్చి	115
2024	మార్చి	135

కేసీఆర్ పర్యటన ఏర్పాట్లు పూర్తి

నేటి ఉదయం 10.30 గంటలకు ధారావత్ తండాకు మాజీ సీఎం

- రైతులతో మాట్లాడి కష్టాలు తెలుసుకునే అవకాశం
- ముందస్తుగా పంట పొలాలను పరిశీలించిన నేతలు



ధారావత్ తండాలో ఎండిన వరిపంట పరిసరాలను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి, పెద్ది

దేవరుప్పుల : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జనగామ జిల్లా పర్యటనకు స్థానిక నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 10:30 గంటలకు ధారావత్‌తండాలో ఎండిపోయిన వరి పంట పొలాలను సందర్శించనున్నారు. బాధిత రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకోనున్నారు. కేసీఆర్ ఉదయం 8.30 గంటలకు ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి నేరుగా ధరావత్ తండాను చేరుకుంటారు. అక్కడ రైతులను పరామర్శించిన అనంతరం సూర్యాపేట జిల్లాకు వెళ్లనున్నారు. ఈ మేరకు ముందస్తుగా ఆయా పంట పొలాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి పరిశీలించారు. అదేవిధంగా ఎర్రబెల్లి పాలకుర్తి నాయకులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను విస్మరించిన తరుణంలో బాధిత రైతులకు బాసటగా నిలిచేందుకు మాజీ సీఎం కేసీఆర్ పర్యటిస్తున్నట్లు తెలిపారు. సాగునీటి విడుదలపై ప్రణాళిక లేకనే పాలకుర్తి నియోజకవర్గంలో పొట్టకాడికి వచ్చిన వరి పంట చేతికి అందని దుస్థితి నెలకొన్నాయన్నారు. నవాబుపేట రిజర్వాయర్ ద్వారా సాగునీరందించడంలో విఫలం కావడంతో రైతులు పంటను రక్షించుకునే దిశలో వందలాది బోర్లు వేసి అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకతీతంగా రైతుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకునేందుకు దోహదపడే కేసీఆర్ పర్యటనకు రైతులు అధిక సంఖ్యలో కదిలిరావాలని పిలుపునిచ్చారు.

నోటీసు తిరస్కరించిన 'జకోటియా'

వరంగల్ అర్బన్: పోచమ్మమైదాన్ సమీపంలో ఇటీవల సంభవించిన జకోటియా కాంప్లెక్స్ అగ్నిప్రమాదంపై బల్దియా ఫైర్ అధికారులు సదరు యజమానికి శనివారం నోటీసులు జారీ చేశారు. కానీ నిర్వాహకులు నోటీసును తిరస్కరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నగరంలోని పలు వ్యాపార, వాణిజ్య కాంప్లెక్స్‌లు 90 శాతం పైగా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని తమకేందుకు నోటీసులు జారీ చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. నగర వ్యాప్తంగా ఉన్నా అన్నీ కమర్షియల్ కాంప్లెక్స్‌లకు నోటీసులు జారీ చేసిన తర్వాత తాము తీసుకుంటామని నిబంధనలు పెట్టినట్లు సమాచారం. ఒత్తిళ్లకు తలొగ్గి బల్దియా సిబ్బంది నోటీసులు అందజేయకుండానే వెనుదిరిగారు. ఈ నోటీసు విషయంపై బల్దియా డీఎఫ్ఓ శంకర్ లింగంను వివరణ కోరగా జకోటియా కాంప్లెక్స్ నిర్వాహకులకు సోమవారం నోటీసులు అందజేస్తామని సమాధానమిచ్చారు.

కంచికి చేరని 'కడియం' ఎపిసోడ్!

- కాంగ్రెస్ పార్టీలో చేరిక నేటికి వాయిదా
- కావ్య అభ్యర్థిత్వంపైనా సీఈసీలో స్పష్టత వచ్చే అవకాశం
- స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి పూర్తయిన అభిప్రాయ సేకరణ
- మరోవైపు 'కడియం'ల చేరికపై ఆగని నిరసనలు
- మద్దతుదారులతో హైదరాబాద్‌లో భేటీ అయిన శ్రీహరి, కావ్య

హైదరాబాద్‌లో ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం



నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా

- హైదరాబాద్‌లో ముఖ్య నాయకులతో కడియం

- 10లో▸

హైదరాబాద్‌లో దీపాదాస్‌మున్షీ క్వార్టర్స్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు



'కడియం'ను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దు

- హైదరాబాద్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ నాయకుల నిరసన

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిపై పీటముడి ఇంకా వీడలేదు. బీఆర్‌ఎస్ టికెట్ నిరాకరించి తండ్రి కడియం శ్రీహరితో కలిసి కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరిక నేటికి వాయిదా పడింది. శనివారం రోజంతా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కేడర్, ముఖ్యనేతలతో భేటీలు నిర్వహించిన తండ్రీకూతుళ్లు ఆదివారం కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు ప్రకటించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఇతర పెద్దల సమక్షంలో చేరనున్నట్లు మొదట ప్రకటించారు. అనంతరం ఢిల్లీకి వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. సీఎం షెడ్యూల్ కుదరకపోవడంతో చేరిక నేటికి వాయిదా పడింది.

'కడియం'ల చేరికపై నిరసనలు..

కడియం శ్రీహరి, కావ్యను పార్టీలోకి తీసుకోవద్దు అంటూ శనివారం కూడా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అక్కడక్కడ నిరసనలకు సిద్ధమయ్యారు. మరోవైపు పార్టీ ద్వారా గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రెస్‌మీట్‌ల ద్వారా డిమాండ్ చేశారు. కడియం శ్రీహరి రాకను స్థానిక కాంగ్రెస్ నేతలు వ్యతిరేకిస్తున్నారు. తమను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన కడియాన్ని పార్టీలోకి తీసుకోవద్దని కోరారు. ఈ మేరకు ప్రత్యేక సమావేశాలను నిర్వహించుకుంటున్నారు. దీంతో నిరసనలకు దిగిన కార్యకర్తలను బుజ్జగించేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగారు. ఇదిలా ఉంటే కడియం శ్రీహరి, ఆయన కూతురు కాంగ్రెస్‌లో చేరడం ఖరారైపోగా.. హైదరాబాద్‌లోని వారి నివాసానికి ఏఐసీసీ నేతలు శనివారం కూడా వెళ్లి పార్టీలోకి ఆహ్వానించారు. వారి చేరిక కోసం వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతల అభిప్రాయాలను కూడా స్వీకరించారు. అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో కడియం శ్రీహరి తన ముఖ్య అనుచరులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి కడియం ముఖ్య అనుచరులంతా ఉదయమే హైదరాబాద్ తరలారు.

కావ్య టికెట్‌పై సస్పెన్స్‌కు నేడు తెర..

ఎంపీ అభ్యర్థుల ఎంపికపై ఆదివారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఉంది. ఈనేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ముఖ్య నేతలు అక్కడికి వెళ్లనున్నారు. అంతకంటే ముందు కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య హైదరా బాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ పెద్దలను కలవనున్నారని సమాచారం. అదేరోజు పార్లమెంట్ అభ్యర్థి ఎంపికపై సీ ఈసీ కీలకభేటీలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నందున కావ్య పేరును ఆదివారం సాయంత్రం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష



మాట్లాడుతున్న డీఆర్డీఓ కౌసల్యదేవి

పర్వతగిరి : మండల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై డీఆర్డీఓ కౌసల్యదేవి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 19 కొనుగోలు కేంద్రాల కమిటీ సభ్యులకు మార్కెటింగ్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సలహాలు, సూచనలు చేశారు. ఐదుగురు కమిటీ సభ్యుల విధులు, ట్యాబ్‌లో టీఎంఎస్ నమోదు చేయడం, తేమశాతం, గన్నీ సంచుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు ధాన్యాన్ని పంపే విధానాన్ని వివరించారు. సమీక్షలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయాలి

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను పారదర్శకంగా ఏర్పాటు చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం రాత్రి విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అమ్మ ఆదర్శ కమిటీల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసే కమిటీకి అధ్యక్షురాలిగా మహిళా సంఘం నాయకురాలు, హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. రెండేళ్ల పరిమితితో సాగే కమిటీలో విద్యార్థుల తల్లులను సభ్యులుగా ఎంపిక చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా పాల్గొన్నారు.

ఇథిలిన్ పౌడర్ ఎక్కువ వాడొద్దు

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి
- పండ్లు మాగబెట్టే విధానంపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్: కృత్రిమంగా పండ్లను మాగబెట్టేందుకు ఎక్కువ మోతాదులో ఇథిలిన్ పౌడర్‌ను వాడొద్దని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన పండ్లు మాగబెట్టే విధానంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పరిరక్షణ విభాగం వరంగల్ జోనల్ ఆఫీసర్ అమృతశ్రీ ఆహార పరిరక్షణ విభాగం నియమ నిబంధనలు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కృత్రిమంగా పండ్లను మాగబెట్టే విధానంలో ప్రభుత్వం కాల్షియం కార్బైడ్‌ను పూర్తిగా నిషేధించిందని తెలిపారు. 10 కిలోల పండ్లకు ఒక ప్యాకెట్ (సాచెట్ పౌడర్) ఇథిలిన్‌ను ఉపయోగించాలని నిర్దేశించినట్లు తెలిపారు. ఎక్కువ మోతాదులో ఇథిలిన్ పౌడర్ వాడడం హానికరమని, ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో గుర్తిస్తే అక్కడికక్కడే వాటిని పారవేస్తామని హెచ్చరించారు. ప్రతి వ్యాపారి రసాయనాలతో మాగిన పండ్లను కాకుండా సహజ సిద్ధంగా పండించిన పండ్లను వినియోగదారులకు అందించాలని, జిల్లాను కార్బైడ్ రహితంగా మార్చేందుకు పండ్ల వ్యాపారులు సహకరించాలని కోరారు. ప్రజలందరు రంగును చూసి మోసపోకూడదని, మార్కెట్‌లో కొనుగోలు చేసిన పండ్లను శుభ్రంగా ఉప్పునీటితో కడిగి తినాలని సూచించారు. ఎవరైనా వ్యాపారులు కలుషిత రసాయనాలతో పండ్లను మాగబెడితే సంబంధిత అధికారులకు సమాచారం అందించగలరని కోరారు. జిల్లా హార్టికల్చర్ అధికారి శీనివాస్ రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నర్సంపేట రూరల్: యువత నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం వరంగల్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సమస్యలపై ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలని, మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవా లని సూచించారు. నిట్ ప్రొఫెసర్ ఆనంద్‌కిశోర్ మాట్లాడుతూ మనిషి అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు, విజ్ఞానం నుంచి శాస్త్రసాంకేతిక రంగాల వైపు పరుగెడుతున్న క్రమంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఎం.భగవాన్‌రెడ్డి, స్వీప్ నోడల్ ఫీసర్ పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ జానకి, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఆకులపల్లి మధు, ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండి సురేష్, గాలి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి, నీటిపన్ను చెల్లించండి

- నేడు ఈ–సేవ కేంద్రాలు పనిచేస్తాయి
- అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్

వరంగల్ అర్బన్ : ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పన్ను చెల్లింపుదారుల కోసం ఆదివారం (నేడు) బల్దియా మీ సేవ కేంద్రాలు పనిచేస్తాయని గ్రేటర్ వరంగల్ అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ ప్రకటనలో తెలిపారు. బల్దియా పరిధిలోని 12 ఈ–సేవ కేంద్రాల్లో ఆస్తి, నీటి పన్నులతోపాటు ఇతర పన్నులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో బల్దియాకు చెందిన రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని వారికి కూడా నేరుగా పన్నులు చెల్లించవచ్చునన్నారు. డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా కూడా పన్నులు చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి చర్యలు

- జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్: ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో హైదరాబాద్ నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో 14,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వారికి ఏప్రిల్ 1 నుంచి 3 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ప్రీ ప్రింటెడ్ ఫాంతో ఎలక్షన్ ఫొటో గుర్తింపు కార్డు జతచేసి శిక్షణ కేంద్రంలో ఉద్యోగులకు అందించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఉద్యోగి ఓటరుగా నమోదైన ప్రాంతంలోనే ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రీ ప్రింటెడ్ ఫాంలో పేరు, ఎంప్లాయ్ కోడ్, ఎలక్షన్ ఫొటో గుర్తింపు కార్డులో తప్పులుంటే వెంటనే ట్రైనింగ్ సెంటర్ల బాధ్యుల దృష్టికి తీసుకొచ్చి ఆన్‌లైన్‌లో సరి చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీవాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఓఎస్‌గా గడ్డం కృష్ణయ్య బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన కృష్ణయ్యను సన్మానిస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేయగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణయ్యను వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కల్లపల్లి ప్రశాంత్, శివకుమార్, గణేష్, హథిరాం, శివ, చరణ్, మారుతి, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- కాంగ్రెస్ పాలకుర్తి ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



కొలన్‌పల్లిలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

రాయపర్తి: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతీ ఒక్కరి కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొలన్‌పల్లిలో గౌడకులస్తులు శనివారం నిర్వహించిన కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ గజ్జి శ్రీనివాస్, గజ్జి వీరయ్య, బండి వెంకన్న, నాగండ్ల మహేందర్, మాచర్ల చందర్, గాదరి మహేందర్, గజ్జి అనిల్, వంగాల యాకయ్య, పనికర విజయ్‌కుమార్ తదితరులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మైలారం శివారులో పంటపొలాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. పెర్కవేడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఊగ మునిత–సుధాకర్ కుమార్తెలు సాత్విక, సిరిచందన నూతన పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, సరికొండ కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, నంగునూరి అశోక్, మహేందర్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న, పుల్లూరు దామోదర్, గబ్బెట బాబు, గుగులోత్ శ్రీను, తీగల సాయిలు, సుతారి యాదగిరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న సందీప్ ప్రకాశ్



అమ్మవారి సన్నిధిలో సందీప్‌ప్రకాశ్ దంపతులు

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి అమ్మవారిని జీఎస్టీ సెంట్రల్ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్ కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. దేవాలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజల అనంతరం అర్చకులు ప్రకాశ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం చేశారు.

మూఢ నమ్మకాలు విడనాడాలి

- నిట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి

మహబూబాబాద్ రూరల్: గ్రామీణ సమాజంలో అనేక రకాల మూఢ నమ్మకాలు ఉన్నాయని, బాబాలు, మాంత్రికులు చేసే మోసాలకు ప్రజలు గురి కావొద్దని నిట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్లో 'మూఢ నమ్మకాలు.. వాస్తవాలు' అనే అంశంపై శనివారం చర్చించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు భౌతికంగా కనిపించే వస్తువులు, పదార్థాలను నమ్మాలి కానీ ఊహాజనిత వాటిని నమ్మొద్దని తెలిపారు. జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ ఆరోగ్యానికి హానీ చేస్తాయని వివరించారు. అనంతరం ఐసీటీ వినియోగం, కంప్యూటర్ విద్య, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహెన్ బీ, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిభారాణి, శ్రీనివాస్, సతీష్ కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, శ్రీధర్, కవిత, తదితరులు పాల్గొన్నారు.



కేయూ బడ్జెట్ రూ.431.20 కోట్లు

- రూ 8.08 కోట్ల లోటు
- అకడమిక్ సెనెట్ ఆమోదం



బడ్జెట్ ప్రవేశపెడుతున్న ప్రొఫెసర్ అమరవేణి

కేయూ క్యాంపస్ : 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాకతీయ యూనివర్సిటీ ప్రతిపాదించిన రూ.431.20 కోట్ల బడ్జెట్‌కు అకడమిక్ సెనెట్ ఆమోదం తెలిపింది. శనివారం వీసీ తాటికొండ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన 39వ అకడమిక్ సెనెట్ సమావేశంలో కామర్స్‌అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్‌హెడ్, ఆ విభాగం డీన్ ప్రొఫెసర్ పి అమరవేణి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సంవత్సరం పాటు ఉద్యోగుల వేతనాలు , విశ్రాంత ఉద్యోగుల పెన్షన్, ఉద్యోగుల విరమణ భత్యాలు, ఇతర ఖర్చులు కలిపి మొత్తం రూ. 449. 73 కోట్లు కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా (బ్లాక్ గ్రాంట్) 134. 94కోట్లు కాగా ఇతర వనరుల నుంచి రూ 296. 26 కోట్లు రాబడి వస్తుందని అంచనావేశారు. వీటిలో యూజీసీ ఎరియర్స్ రూపంలో రూ 32. 81కోట్లు ,అకడమిక్, ట్యూషన్ ఫీజులు రూపంలో రూ. 8కోట్లు , అంతర్గత వనరుల ద్వారా రూ 24.28 కోట్లు, పరీక్షల విభాగం నుంచి రూ. 58.79 కోట్లుగా చూపారు. 8 అంశాల్లో రాబడులు, ఖర్చులు చూపించారు. అంతర్గతంగా సమకూర్చుకునే నిధులతో కలిపి మొత్తం ఆర్థిక సంవత్సరంలో 431.20 కోట్లు రాబడిగా పేర్కొన్నారు. వివిధ అంశాల్లోనూ ఖర్చు కూడా అంతకంటే ఎక్కువగా 449 .73 కోట్లుగా చూపారు. ఈసారి లోటు బడ్జెట్ రూ. 8 కోట్ల 8లక్షలని వెల్లడించారు. ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు రూ 207 .44 కోట్లు, పరీక్షలు, అకడమిక్ కార్యక్రమాలకు రూ 63.44 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్‌ను అకడమిక్ సెనెట్ ఆమోదించింది. కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ కోలశంకర్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ , సెనేట్ సభ్యులు మాణిక్యరావు ,క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ బి సురేష్‌లాల్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి మాట్లాడారు. కాగా, దృశ్య ,శ్రవణ విధానంలో మూడు సంవత్సరాల అభివృద్ధి కార్యక్రమాలను వల్లాల పృథ్వీరాజ్ ప్రదర్శించారు.

బడ్జెట్ సందర్భంగా సెనెట్ సభ్యులు ఏమన్నారంటే..



కేయూలో అకడమిక్ సెనెట్ వేదికపై వీసీ రమేష్, రిజిస్ట్రార్ మల్లారెడ్డితోపాటు ప్రొఫెసర్ అమరవేణి, ఫైనాన్స్ ఆఫీసర్ తోటరాజయ్య

అకడమిక్ పరంగా మెరుగైన చర్యలు

కాకతీయ యూనివర్సిటీలో అకడమిక్ పరంగా మెరుగైన చర్యలు తీసుకుంటాం. సకాలంలో పరీక్షలు, ఫలితాలు చేపడుతున్నాం. ఆన్‌లైన్‌లోనే ప్రశ్నాపత్రాలు పంపడం, వివిధ సర్టిఫికెట్ల జారీ కూడా ఆన్‌లైన్‌లోనే చేస్తున్నాం. విద్యార్థులు యూనివర్సిటీకి రాకుండానే సర్టిఫికెట్లు పొందే చర్యలు చేపడుతున్నాం. పలు కొత్త కోర్సులు కూడా ప్రవేశపెట్టాం.

- పి మల్లారెడ్డి, రిజిస్ట్రార్

అధ్యాపకులను నియమించాలి



కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకుల కొరత అధికంగా ఉంది. గత ప్రభుత్వం యూనివర్సిటీల్లో అధ్యాపకులను నియమించలేదు. కాంట్రాక్ట్, రెగ్యులర్ ఫ్యాకల్టీతోనే నెట్టుకొస్తున్నారు. కేయూకు న్యాక్ ఏప్లస్ గ్రేడ్ రావొచ్చు. అందుకు అధికారులు టీమ్ వర్క్ చేసి సాధించొచ్చు.అయితే రెగ్యులర్ అధ్యాపకులను నియమించకుండా యూనివర్సిటీ బాగుపడుతుందంటే నాకైతే నమ్మకం లేదు.

- డాక్టర్ అంపశయ్యనవీన్, సెనెట్ సభ్యుడు

అధ్యాపకులు తగ్గారు..



యూనివర్సిటీలో రెగ్యులర్ ఫ్యాకల్టీ చాలా తగ్గింది. అధ్యాపకుల నియామకం లేదు. గత ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీలను ఏర్పాటు చేసింది. దీని వల్ల ప్రభుత్వ యూనివర్సిటీలపై తీవ్ర ప్రభావం పడుతోంది.అకడమిక్ సెనెట్ సభ్యులు కూడా తగ్గిపోయారు. నేను 2005లో కేయూకు అకడమిక్ సెనెట్ ఏర్పాటు చేయించా. కేవలం నామినేటెడ్ సభ్యులే 50నుంచి 60మంది ఉండేవారు. ఇంకావేరే వారు కూడా. ప్రస్తుతం సెనెట్ సభ్యుల సంఖ్య బాగా తగ్గింది.

- వి గోపాల్‌రెడ్డి, కేయూ మాజీ వీసీ, సెనెట్‌సభ్యుడు

పరిశోధనలు నిరంతరం జరగాలి



యూనివర్సిటీలో పరిశోధనలు నిరంతరం జరగాలి. పలు విభాగాల్లో అధ్యాపకుల కొరత ఎక్కువగా ఉంది. పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కావొద్దు. నిధుల సేకరణ జరగాల్సింటుంది. మౌలిక సదుపాయల కల్పన కూడా అవసరం. స్టాండింగ్ కమిటీ మినట్స్‌లో దొర్లిన తప్పులు కూడా ఎత్తిచూపారు.

- విద్యావతి, కేయూ మాజీ వీసీ, సెనెట్ సభ్యురాలు

అలుమిని అసోసియేషన్స్ సహకారం తీసుకోవాలి

కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి అలుమిని అసోసియేషన్స్ సహకారం తీసుకోవాలి. ఆర్థికపరమైన సహకారంతో యూనివర్సిటీ అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుంది. కేయూ న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించడం ఆనందంగా ఉంది. ఈ విషయంలో యూనివర్సిటీ అధికారులు సమష్టిగా కృషి చేశారు.

- ఇక్బాల్ అలీ, శాతవాహన యూనివర్సిటీ మాజీ వీసీ , కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్

యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

సమిష్టి కృషితోనే కేయూకు న్యాక్‌ఏప్లస్ గ్రేడ్ లభించింది. 30 ఏళ్ల తరువాత హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించాం. కేయూలో కేహెబ్, పీవీ నాలెడ్జ్‌సెంటర్‌ను ఏర్పాటుచేసుకున్నాం. రూసా కింద రూ. 34కోట్లు మంజూరయ్యాయి. యూనివర్సిటీ అభివృద్ధికి దాతల సహకారం తీసుకునేందుకు యత్నిస్తున్నాం.

- తాటికొండ రమేష్, వీసీ

బీఈడీ, ఎంఈడీ కోర్సులను నిలబెట్టుకున్నాం

కాకతీయ యూనివర్సిటీలో విద్యాకళాశాలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ ఒక్కరు కూడా లేకపోవడంతో బీఈడీ, ఎంఈడీ కోర్సులపై తీవ్ర ప్రభావం పడింది. కోర్సులు ఎత్తివేసే స్థితిలో వీసీ రమేష్ 15మంది గెస్ట్ ఫ్యాకల్టీని నియమించి కోర్సులు కొనసాగేలా చర్యలు చేపట్టారు. నేను రిటైర్డ్ అయినా విద్యా విభాగంలో డీన్‌గా అవకాశం కల్పించారు.

- రాంనాథ్‌కిషన్, డీన్ విద్యాకళాశాల, సెనెట్ సభ్యుడు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో తప్పు చేయలేదు

నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించాం. ఎలాంటి తప్పుచేయలేదు. ఇప్పటికీ ఆ సమస్య కొనసాగుతూనే ఉంది. హిస్టరీ విభాగంలో ఒక్క రెగ్యులర్ ప్రొఫెసర్‌గా నేనే ఉన్నా. వీసీ రమేష్‌తోపాటు అందరి సమష్టి సహకారంతోనే కేయూలో హిస్టరీ కాంగ్రెస్‌ను విజయవంతం చేశాం.

- టి మనోహర్, డీన్, సోషల్ సైన్స్, సెనెట్ సభ్యుడు

బీజేపీ పాలనలో విద్యారంగం విధ్వంసం

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



కేయూలో విద్యార్థి సంఘాల బాధ్యులతో రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

కేయూ క్యాంపస్ : కేంద్రంలోని బీజేపీ పాలనలో దేశ విద్యారంగం పూర్తి విధ్వంసానికి గురైందని, ఫలితంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన, ముస్లిం మైనారిటీ వర్గాల విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన వామపక్ష, బహుజన విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి అదానీ, అంబానీ లాంటి ప్రైవేట్ , కార్పొరేట్ల అభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తి ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి పట్ల లేదని మండిపడ్డారు. దేశంలోని విద్యార్థి, యువతకు విద్య, ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానం– 2020 అమలు ఫలితంగా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం కొరవడి, కుల, మత విద్వేషాలు రగిలే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దక్పథంతో కూడిన ప్రశ్నించే తత్వం, ప్రజాస్వామిక లక్షణాలు అలవర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకారెడ్డి, ఓయూ ప్రొఫెసర్ పద్మజాషా, సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర నాయకుడు పృథ్వీ, సామాజిక ఉద్యమకారిణి నిర్మల, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి పి.మహేష్, ఏఐఎస్‌ఎఫ్ యూనివర్సిటీల ఇన్‌చార్జ్ రహమాన్, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద నరేష్, బీఎస్‌ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్, టీవీవీ కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసు ఛేదన

- ఇద్దరి నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీసీపీ రవీందర్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నర్సంపేట: మహిళ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. ఈ మేరకు నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్య వివరాలు వెల్లడించారు. దుగ్గొండి మండలం మైసంపల్లికి చెందిన వెంగళ సుప్రియ(27), రాజ్‌కిరణ్ దంపతులు తమ పిల్లలతో కలిసి గ్రామంలోనే నివసిస్తున్నారు. రాజ్‌కిరణ్ హనుమకొండలోని బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సుప్రియకు పరిచయస్తుడు, ములుగు జిల్లా కేంద్రంలోని బలిజవాడకు చెందిన తాటిపల్లి శశికాంత్ ప్రస్తుతం హైదరాబాద్‌లో స్విగ్గిలో జాబ్ చేస్తూ అదే జిల్లా జగన్నపేట మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా శిరీషతో కలిసి సహజీవనం చేస్తూ హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం తన అనారోగ్య కారణాలతో సుప్రియ.. శశికాంత్‌కు ఫోన్ చేసి హాస్పిటల్ వివరాలు తెలుసుకుంది. ఈ ఫోన్ కాల్ విషయంలో శిరీష, శశికాంత్‌కు గొడవ జరిగింది. అనంతరం ఇద్దరు బైక్‌పై మైసంపల్లికి వచ్చి సుప్రియను మందలించి హైదరాబాద్ వెళ్లారు. ఆ సమయంలో సుప్రియ వద్ద ఉన్న బంగారం చూసి ఆమెను చంపి బంగారం ఎత్తుకెళ్లడానికి పథకం వేశారు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన శిరీష, శశికాంత్ బైక్‌పై హైదరాబాద్ నుంచి సుప్రియ ఇంటికి వచ్చారు. ఆమెను విచక్షణారహితంగా కొట్టి గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం తన శరీరంపై ఉన్న బంగారం తీసుకుని పారిపోయారు. తర్వాత హైదరాబాద్‌లోని ఏఎస్ రావు నగర్ బీమా గోల్డ్ కంపెనీలో చోరీ చేసిన బంగారం కరిగించి గోల్డ్ చైన్‌లు చేయించుకున్నారు. మిగతా చోరీ చేసిన వస్తువులు అమ్ముకోవడానికి శనివారం ఖానాపురం మండలంలో తెలిసిన వారి దగ్గరకు వస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పట్టుకుని విచారించారు. ఇందులో సుప్రియహత్యకు సంబంధించి నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు డీసీపీ రవీందర్ వెల్లడించారు. వారి వద్ద నుంచి బంగారం, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఏసీపీ కిరణ్‌కుమార్, దుగ్గొండి సీఐ రాజగోపాల్‌గౌడ్, దుగ్గొండి ఎస్సై పరమేష్, ఖానాపూర్ ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

సరిహద్దు పోలీసుల సమావేశం

- పార్లమెంట్ ఎన్నికలు, మావోయిస్టుల నియంత్రణ, అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు ఏర్పాటుపై చర్చ



సమావేశం నిర్వహిస్తున్న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసులు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు పోలీసులు రహస్య సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం విలేకరులకు వెల్లడించారు. ములుగు ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు వెంకటాపురం(కె) సీఐ కుమార్ ఆధ్వర్యంలో వెంకటాపురం(కె), ఆలుబాక, వాజేడు, పేరూరు ఎస్సైలు అశోక్, తిరుపతి, వెంకటేశ్వరరావు, రమేష్, ఛత్తీస్‌గఢ్‌లోని తాళ్లగూడ ఇన్‌స్పెక్టర్ హుబులాల్, భద్రకాళి ఇన్‌స్పెక్టర్ సత్యవతి సాహు, మహేశ్వర శంఖర, సురేష్ బిన్‌తో అంతర్ రాష్ట్ర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన భద్రతాచర్యలు, మావోయిస్టుల కార్యకలాపాలను ఎప్పటికప్పుడు నియంత్రించడం, తదితర అంశాలపై చర్చించారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు ఏర్పాటుపై చర్చించారు.

బైక్ పైనుంచి పడి ఒకరి దుర్మరణం

- మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : ద్విచక్రవాహనంపై నుంచి పడి ఒకరు దుర్మరణం చెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని దాసరి బజార్‌లో నివాసం ఉండే దూదికట్ల మహేష్ కుమార్ (45) నెల్లికుదురు మండలం మునిగలవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై జీతాల బిల్లుల ఫైల్ తీసుకుని పాఠశాల హెచ్‌ఎంకు ఇచ్చేందుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో దాసరి బజార్ ప్రాంతంలో రోడ్డుపై ఉన్న గుంతలో వాహనం ఇరుక్కుంది. దీంతో బైక్‌పై నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో మహేష్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..



ధనలక్ష్మి మృతదేహం

గూడూరు : రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని మచ్చర్లలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మచ్చర్లకు చెందిన యాద ధనలక్ష్మి (67) తన మనుమరాలిని చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లింది. తిరిగి అదే రోజు రాత్రి మచ్చర్లలో బస్సు దిగి రోడ్డు దాటుతుంది. ఈ క్రమంలో మహబూబాబాద్ నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న కారు ఢీకొనడంతో ధనలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స అందిస్తుండగానే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు.

టాటా మ్యాజిక్ బోల్తా..

- పలువురు విద్యార్థినులకు స్వల్ప గాయాలు



ఘటనాస్థలిలో పోలీసులు

చిట్యాల: టాటా మ్యాజిక్ బోల్తాపడి పలువురు విద్యార్థినులు, ఓ ఉపాధ్యాయురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం జరిగింది. మండల కేంద్రంలోని కస్తూర్బాకు చెందిన 12 మంది విద్యార్థినులు ఓ ఉపాధ్యాయురాలితో కలిసి సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు టాటా మ్యాజిక్ వాహనంలో వెళ్లారు. ఈ క్రమంలో పాఠశాల ఎదుట రోడ్డు పక్కకు వాహనం నిలిపే క్రమంలో బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న పావని, ప్రణీత, చంద్రశ్రీ, అంజన, హరిత, గౌతమి, అమూల్య, అర్చన, అస్మిత, సుప్రియ, మమత, నిషిత, ఉపాధ్యాయురాలు స్వప్నకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు స్థానిక సివిల్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం పరీక్ష రాశారు. టాటా మ్యాజిక్ బోల్తా పడిన విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎంఈఓ రఘుపతి ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థునుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కాగా, విద్యార్థినులకు తీవ్ర గాయాలుకాకపోవడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రాణం తీసిన చేపల వేట..

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- పాలేరు వాగులో ఘటన ..



రమేష్ (ఫైల్)

మరిపెడ రూరల్: మిత్రులతో కలిసి విద్యుత్ పెట్టి చేపలు పడుతుండగా అదే విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల శివారు పాలేరు వాగులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తానంచర్ల రెవెన్యూ పరిధిలోని వాల్యతండా జీపీకి చెందిన బానోతు రమేష్ (38) అదే తండాకు చెందిన మిత్రులు తేజావత్ రంగ, మల్సూర్, సురేష్, మహేష్, చందు, యాకూబ్, కోట్యతండాకు చెందిన ఈరుతో కలిసి మొత్తం 8 మంది పాలేరు వాగులో చేపల వేటకు వెళ్లారు. అక్కడ వాగులో విద్యుత్ పెట్టి చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో నీటిలో ఉన్న రమేష్ విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విద్యుత్‌తో చేపలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని తండా వాసులు అధికారులను వేడుకుంటున్నారు.

ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి

- రెడ్డిపురం కుంటలో ఘటన



కుంట నుంచి నాగరాజు మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

హసన్‌పర్తి : ఈతకు వెళ్లిన ఓ బీటెక్ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం కుంటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న పింగిలి నాగరాజు(19) బంధువులతో కలిసి రెడ్డిపురం సమీపంలోని ఓ కుంటలో ఈతకు వెళ్లాడు. అయితే ఆ కుంటలో మునిగాడు. దీంతో ఆందోళనకు గురైన బంధువులు ఈ విషయాన్ని ఫోన్ ద్వారా తమ తల్లిదండ్రులకు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక సిబ్బంది గంట సమయం మృతదేహం కోసం గాలించారు. చివరకు పాతాల గరిగెకు మృతదేహం చిక్కింది. ఫైర్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో ఎల్ఎఫ్ కె.జనార్దన్, కె. వెంకటేశ్వర్లు, ఎ. రూప్‌సింగ్, ఎం.డి యాకూబ్, బాలు.. నాగరాజు మృతదేహాన్ని వెలికి తీసి పోలీసులకు అప్పగించారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ సంజీవ తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు..



హరీష్ (ఫైల్)

చిల్పూరు: కుటుంబ కలహాలతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రాజవరంలో జరిగింది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాతరగొండ ఎల్లయ్య, రాజవ్వ దంపతుల కుమారుడు హరీష్(23) సెంట్రింగ్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన కుటుంబంలో గొడవలు జరిగాయి. దీంతో హరీష్ క్షణికావేశంలో అదే రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

- రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B- ఫార్మసీ, D.Ed(TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc(నర్సింగ్), GNM. Ph: 8866977112, 339 [HA-13637]

TRAINING COURSE

- మహిళలకు శుభవార్త ! నిరుద్యోగ మహిళలకు Pre Primary Teacher Training Course (PPTTC) లో Certificate & Job Placement. Call: 9000668448. [W-1264869]

REAL ESTATE

- మీరు ప్లాట్లు /అపార్ట్‌మెంట్లు / ఇళ్లు అమ్మాలనుకుంటున్నారా? ఎక్కడైనా కొనాలనుకుంటున్నారా ? ఈ క్రింది నెంబర్‌కు సంప్ర: రామారావు 9866722861. [WA-13920]

TO-LET

- WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. కిరాయి రూ।। 10 వేలు. సంప్ర।। 9848696291. [W-1264920]
- Hanamkonda Sri Sai Colony, 2 BHK, 5 Rooms 10,000/-, 1 BHK 4 Rooms 7000/-, 1 BHK 3 Rooms 6000/-, Forest Office, Subedari, Cont: Cell: 9849596557. [W-1264870]

HOUSE FOR SALE

- శివనగర్, వాలామార్ట్ దగ్గర 105 గజాలు వెస్ట్ ఫేస్ 30ft రోడ్ G+2 SIZE +(15x63) గ్రౌండ్ ఫ్లోర్ మరియు 1st ఫ్లోర్ 3 రూమ్స్, 2nd ఫ్లోర్ స్లాబ్ గల ఇల్లు అమ్మబడును. ధర 6800000/- సంప్ర। 9963218888. [WA-13938]
- కేవలం రూ।। 26 లక్షలకే డబుల్ బెడ్ రూం హౌస్ EMI పద్ధతిలో అమ్మబడును. బ్యాంకు లోన్ సౌకర్యం కలదు. సంప్రదించండి: సెల్: 9573689941. [WA-7507]

PLOT FOR SALE

- భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో KTK-8 ఇంక్లైన్ రోడ్‌కు 450 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్ అమ్మబడును. కావాలనుకునేవారు 7815846353 నంబర్‌కు సంప్రదించగలరు. [W-1264865]
- మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశల వాకిళ్లు నుండి మరియు జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పురా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 283, 228 అమ్మకానికి 9032111600. [W-1264856]
- GWMC & KUDA అప్రూవ్ లేఅవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును. గజం కేవలం 15,000/- మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264867]

- వరంగల్‌హైవే ఆలేరు దగ్గర్లో రిసార్ట్స్ ఫామ్ హౌస్ ప్లాట్స్(విత్ లైఫ్ టైం రిసార్ట్ మెంబర్‌షిప్) 121 చ।।గజం ప్లాట్లు కేవలం. 6 లక్షలకే (5సం।। తరువాత Buy Back డబుల్ హామీ) 9502994443 [H-804837]

LEASE / RENT

- HNK, అదాలత్ నుండి K.L.N.రోడ్‌కు వెళ్ళే మెయిన్‌రోడ్ (S.V.కాలనీ) రోడ్ నెం.5 లో 4 అంతస్తుల భవనం ప్రతి ఫ్లోర్ 1650 Sft. కిరాయికి / లీజ్ ఇవ్వబడును (New బిల్డింగ్). 9502879612. [M-11617]

SERVICES

మినరల్ వాటర్ మిషన్స్ (R.O)

- హాస్టల్‌లకు, పరిశ్రమలకు, గ్రామాలకు కూల్ మిషన్స్, వాటర్ ప్లాంట్ మిషన్స్ (R.O) లభించును. కెమికల్స్, ఫిల్టర్, etc. K.K.ఆక్వా. 7306888555, 8121026555. [WA-2217]

OLD AGE HOME

- స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/ హోంకేర్ సర్వీస్: 24 గం।। వృద్ధులను, పెద్దవారిని, పేషంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి, ఇంటి, వంట పని చేయుటకు మీ ఇంటివద్దకే అనుభవం గల వర్కర్లని స్త్రీ/పు।।లను పంపించగలము. 8186926067, 8977263124. [W-1220996]

WANTED

- Wanted Wheel Alignment Technicians (2) Min. 2 yrs Exp. required. Driving compulsory, Walk-in-Interview on 31st Mar. & April 2024 Cont: Hema Hyundai Service, B-5 Industrial Estate, Near Mulugu Road, Warangal. 8008204465, 9703058686. [WA-13939]
- యువరాజ్ కిరాణంలో పనిచేయుటకు కిరాణంలో 1 సం।। చేసిన అనుభవం గల యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర।। అండర్‌బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7503]
- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీ: 12000–14000/-. 8 గం।।, 12 గం।। డ్యూటీలు కలవు. సెల్: 9000463426. [W-1264955]
- BS ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీలో పని చేయుటకు చురుకైన రిసెప్షనిస్ట్, బిజినెస్ డెవలపర్స్, అసిస్టెంట్ మేనేజర్స్, జనరల్ మేనేజర్స్ (స్త్రీ/పు) అర్జెంటుగా కావలెను. VRS వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వబడును 7799777394. [WA-13929]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 9059663584, 9502615217. [M-1185009]
- Experienced Supervisors Needed. 1year of Waterproofing Experience Required. Contact Jaya Bharathi Constructions at 8790508663 [HA-10285]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులనుపేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-799859]
- Hiring Agents (M/F) to Work in Life License an Road Education Consultants TS & AP Good Sal + Incentives. Ph: 7416348701/ 8919438680 [H-799827]
- Required Electrical Contractors - IRP Infra Tech Pvt Ltd, a Leading Telecom Infrastructure Company is looking for ELECTRICAL CONTRACTORS to Execute Earthing & Electrical Works in Ground Based Telecom Towers in Various Locations of Andhra Pradesh. Interested Contractors Apply by E-mail to electirp24@gmail.com or Contact ✆ 91604 42234, 83098 81908 [OA-468]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।। మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.